పైప్‌లైన్ లీకేజీతో పంటకు నష్టం

- పట్టించుకోని భగీరథ అధికారులు
- ఎవరికి చెప్పకుంటారో చెప్పకోండని రైతుకు బెదిరింపులు
- సదాశివనగర్ శివారులో లీకేజీ


పొలంలో దెబ్బతిన్న వరి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారు 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన మల్లుపేట్ బ్రిడ్జి వద్ద నాయిని గంగరాజు అనే రైతుకు చెందిన పంట పొలంలో నుంచి వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. దీంతో సాగు చేసిన వరి పంట పూర్తిగా ధ్వంసమైంది. వరద ఉధృతికి పంట కొట్టుకుపోయినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని కోరారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో గ్రామానికి చెందిన నెల్లి నర్సయ్యకు బుధవారం రూ.48 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీటీసీ రాంచందర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుడ్ల శ్రీకాంత్ రావు, రైతుబంధు అధ్యక్షుడు రాజు, నాయకులు పరమేశ్, శ్రీనివాస్ గౌడ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు..



రాజంపేట: బసన్నపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రెండో విడతలో భాగంగా గొర్రెల యూనిట్లను పంపిణీ చేసినట్లు మండల పశువైద్యాధికారి అనిల్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ లింగాల స్వరూప, సర్పంచ్ శ్రీజారమేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు కూలిపోయిన బాధితులకు కిట్లు..



గాంధారి(ఎల్లారెడ్డి): భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయిన బాధితులకు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో కిట్లను రెడ్‌క్రాస్ సంస్థ మండల చైర్మన్ అన్నారెడ్డి అందజేశారు. ఈ కిట్టులో వంట సామగ్రి, టార్పాలిన్ కవర్, బ్లాంకెట్లు ఉంటాయని ఆయన తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ అభివృద్ధికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన పన్యాల రాంమోహన్‌రెడ్డి రూ.10,116, అదేవిధంగా బోడ రాజేంద్రప్రసాద్ రూ.3800 అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అబ్రబోయిన రాజు తెలిపారు. ఆలయ కమిటీ డైరెక్టర్లు చెన్న కాంతం, బత్తిని సునీత, రాజనర్సు, రాజేందర్, ఈవో ప్రభు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

దోమకొండ: శివరాంమందిర్‌లో బుధవారం శ్రావణ మాసం చివరి బుధవారం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, ఆలయకమిటి అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



మాచారెడ్డి: గ్రామాల్లో రోడ్డు పక్క నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని గజ్యా నాయక్ తండా, భవాని పేట, ఘన్పూర్ గ్రామాల్లో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్క ఏపుగా పెరిగేట్లు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సర్పంచులు, ఉపసర్పంచులు, సిబ్బంది ఉన్నారు.

సమయ పాలన పాటించాలి



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంపీడీవో సతీష్ అన్నారు. బుధవారం ఆయన పిస్కిల్‌గుట్ట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కళాశాలకు పీజీ కోర్సులు మంజూరు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉన్నత విద్యా పీజీ కోర్సులు మంజూరయ్యాయని ఎంపీపీ అశోక్ పటేల్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ అన్నారు. ఎంపీపీ బుధవారం కళాశాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చిందని, అలాగే మంజూరైన పీజీ కోర్సులలో ఎంఏ(తెలుగు, ఇంగ్లీష్), ఎంకాం ఉన్నాయన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు పెట్టుకోవాలని కోరారు.

నకిలీ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్, ఎస్పీలకు జర్నలిస్టుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కామారెడ్డి టౌన్: నకిలీ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డిలకు బుధవారం స్థానిక జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లా నార్సింగిలో బెదిరింపులకు పాల్పడిన కామారెడ్డి జిల్లాకు చెందిన ఐదుగురు జర్నలిస్టులపై కేసులు నమోదైన నేపథ్యంలో నకిలీ జర్నలిస్టుల అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సొంతంగా నకిలీ ఐడీ కార్డులు తయారు చేసుకుని జిల్లాలోని రైస్ మిల్లర్లు, వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి జర్నలిస్టుల తీరుతో ఫీల్డ్ మీద నిజాయతీగా పని చేస్తున్న అసలైన జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవసరమైతే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్, ఎస్పీలు తక్షణమే చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు వేణు, అంజి, నాగరాజు, కిషన్, రాము, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్


జిల్లా కేంద్రంలో మ్యాజిక్ షో చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగి


నిద్రిస్తున్న సర్వ శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమను ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారానికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో మ్యాజిక్ షో చేసి నిరసన తెలిపారు. తమ జీవితాలతో చెలగాటమాడవద్దని, చాలీ చాలనీ వేతనాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు తెలిపారు. నాయకులు దామోదర్, సత్యనారాయణ, శ్రీధర్ కుమార్, సంపత్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్వశిక్ష ఉద్యోగుల జాగరణ

కామారెడ్డి టౌన్: సర్వశిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షా శిబిరంలో మహా జాగరణ చేపట్టారు. రాత్రి దీక్షా శిబిరంలోనే నిద్రించారు. 24 గంటల జాగరణలో భాగంగా శిబిరంలో బస చేస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్‌లను నెరవేర్చాలన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం


తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న రెడ్డి సంఘం నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తిర్మన్‌పల్లి గ్రామ మారవారి రెడ్డి సంఘం సభ్యులు బుధవారం జిల్లా కార్పొరేషన్ సభ్యులకు తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.2 వేల కోట్లు మంజూరు చేస్తానని సీఎం మాట ఇచ్చి తప్పారని విమర్శించారు. రెడ్డి కార్పొరేషన్ అభివృద్ధి కోసం తగిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కార్యదర్శి చిన్న గంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు పేర్కొన్నారు. బుధవారం ఉత్తునూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతె సాయవ్వ, ఉప సర్పంచ్ శివపాటిల్, విండో చైర్మన్ ప్రభాకర్ రావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్‌లో శనివారం జరగబోయే ఆత్మీయ సమ్మేళనం బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలకుంట్ల రాము కార్యకర్తలను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్, ప్రధాన కార్యదర్శి అద్దాల జైపాల్ రెడ్డి, సంజయ్ పటేల్, అశోక్ పటేల్, సుభాష్, జ్యోతి లాల్ తదితరులు పాల్గొన్నారు.



మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల బాలుర పాఠశాలను ఆర్డీవో భుజంగరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో ఆర్డీవో మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని సౌకర్యాలను కల్పించడంలో అధ్యాపకులు ముందుండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజు, గిర్దావార్ అంజు ఉన్నారు.

స్పీకర్‌కు మద్దతు తెలిపిన ఇబ్రహీంపేట గ్రామస్తులు



బాన్సువాడ రూరల్: వచ్చే ఎన్నికల్లోనూ తాము స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఉంటామని బుధవారం ఇబ్రహీంపేట్ గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, పలు కుల సంఘాల ప్రతినిధులు, గ్రామ సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో స్పీకర్ పోచారంను కలిసి మద్దతు లేఖ అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాడ్కోల్ బీడీ వర్కర్స్ కాలనీ కమిటీ ఎన్నిక



బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అధ్యక్షుడిగా బొప్పిడి సంతోష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మిర్చి గౌస్, క్యాషియర్‌గా శ్రీనివాస్, సలహాదారులుగా రాంప్రకాష్, నారాయణ, చిట్టి బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, వాసు, గణేష్, కోటి, యమునగౌడ్, ఇంతియాజ్‌లను ఎన్నుకున్నారు.

భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి


లడ్డూ తయారీని ప్రారంభిస్తున్న వెంకటరమణారెడ్డి


అడ్లూర్‌లో భూమి పూజ చేస్తూ..

- వినాయక మండపాలకు బీజేపీ లడ్డూ అందజేస్తాం
- బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లాలో భక్తి శ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి కోరారు. ప్రతి ఏడాదిలాగా ఈ సారి కూడా బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి మండపానికి లడ్డూ ప్రసాదం అందజేస్తామన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లడ్డూ ప్రసాదం తయారీని ఆయన ప్రారంభించారు. ఆరేళ్లుగా బీజేపీ తరఫున కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో ఉన్న 3 వేల వినాయక మండపాలకు లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు.

పలు నిర్మాణ పనులకు భూమి పూజ

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు అడ్లూర్‌లోని గంగపుత్ర సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి భూమి పూజ చేశారు. అలాగే 2వ వార్డు పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో గౌడ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు ఎల్లమ్మ టెంపుల్ ఆలయ సీసీ పనులను ఆయన ప్రారంభించారు.

నూతన బోరుబావి తవ్వకం ప్రారంభం

రాజంపేట: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం భవనం వద్ద బుధవారం కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆదేశాల మేరకు నూతన బోరు బావి తవ్వకాన్ని ప్రారంభించారు. రాజంపేట ముదిరాజ్ సంఘం సభ్యుల కోరిక మేరకు ఈ నూతన బోరుబావి తవ్వకాన్ని చేపట్టినట్లు రాజంపేట బీజేపీ నేతలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి పిట్ల శీను, టౌన్ అధ్యక్షుడు గుర్రాల రాము, మహిళా మోర్చా అధ్యక్షుడు సంధ్య, స్వామి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకోవాలి


వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

బాన్సువాడ రూరల్: వయస్సు పైబడిన వారు, తరచూ అనారోగ్యానికి గురయ్యేవారే కాకుండా ప్రతి ఒక్కరు రక్త పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలని డాక్టర్లు సంతోష్‌రెడ్డి, శ్రీలత పేర్కొన్నారు. బుధవారం వారు బోర్లం గ్రామంలో హన్మాజీపేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించి ప్రజలకు సూచనలు చేశారు. బీపీ, షుగర్, హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగాన్ని ముందుగా నిర్ధారిస్తే దాన్ని అదుపు చేయడం కష్టం కాదన్నారు. ధూమపానం, మద్యపానం, అసురక్షిత సెక్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ సరళ, ఎంపీటీసీ శ్రావణి, ఉప సర్పంచ్ మంద శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్రభుత్వం అంగన్‌వాడీల చెవిలో పువ్వు పెడుతోంది’


పిట్లంలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నేత అరుణతార


లింగంపేటలో ..కాంగ్రెస్ నేతలు


మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేత గంగారాం


ఎల్లారెడ్డిలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడి సిబ్బంది సమ్మె కొనసాగించారు. బుధవారం చెవిలో పువ్వు పెట్టుకుని, మోకాళ్లపై కూర్చుని, వివిధరకాలుగా అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్ల యూనియన్ నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల చెవిలో పువ్వు పెడుతోందని విమర్శించారు. గ్రామాల్లో పేద పిల్లలకు సేవలందించడంతో అంగన్‌వాడీ టీచర్లు ముందుంటారని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. 40 ఏళ్లుగా పని చేస్తున్నా జీవన ప్రమాణాలు పెరగలేదని, వెంటనే అంగన్‌వాడీ టీచర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


నాగిరెడ్డిపేటలో ..


బాన్సువాడలో..


మాచారెడ్డిలో బతుకమ్మ ఆడుతూ నిరసన..


నిజాంసాగర్‌లో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


సరుకులను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట, అచ్చాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్ వేర్వేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించారు. అలాగే నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. వారివెంట అచ్చాయపల్లి పంచాయతీ కార్యదర్శి రమ్య ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా పాశుపత రుద్రయాగం



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని కల్కినగర్ కోటిలింగేశ్వర అభయ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు మత్స్యేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పాశుపత రుద్రయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం చేశారు. లోక కల్యాణార్థం యాగాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు తెలిపారు.

కొండంత అండ.. బాలాజీ జెండా

మద్నూర్(జుక్కల్): తిరుమలలో కొలువైన శ్రీ వేంకటేశ్వరుడే ఇక్కడకు వచ్చి భక్తులకు కొండంత అండగా నిలబడుతున్నాడని భక్తులు పేర్కొంటున్నారు. మద్నూర్ మండల కేంద్రంలో కొలువుదీరిన బాలాజీ జెండాకు భక్తులు ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఏడుకొండలవాడ వెంకట రమణా గోవిందా అంటూ భక్తులు భజనలు, ప్రత్యేక పూజలు చేయడంతో జెండా ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మరో మూడు రోజుల్లో శ్రీవారి బాలాజీ జెండా తిరుపతికి బయలుదేరుతుందని జెండా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సమాజ శ్రేయస్సు కోసం యజ్ఞం



లింగంపేట(ఎల్లారెడ్డి): సమాజ శ్రేయస్సు కోసం పూర్ణాహుతి, యజ్ఞాలు దోహదపడతాయని వేదముని, ఓంముని గురువులు వెల్లడించారు. బుధవారం వారు లింగంపేట మండల కేంద్రంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు శ్రావణ మాసం సందర్భంగా ఇంటింటా యజ్ఞాలు చేయడం వల్ల వాతావరణం కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణ, మానవతా పరిరక్షణ జరుగుతుందన్నారు. ఈ నెల 17న జంగంపల్లిలోని వేదమందిరము ఆర్యసమాజములో ఉదయం నుంచి సాయంత్రం వరకు యజ్ఞము, ప్రవచనాలు, పాటలు, భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్యసమాజం ఆలయ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఉన్నారు.

ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం హోమం నిర్వహించారు. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో మూడు రోజుల పాటు హోమం జరుగుతుందని వేద ధర్మ ప్రచారకులు వేదసింధు తెలిపారు. యజ్ఞాల వలన వర్షాలు, ఆయురారోగ్యం పెరుగుతుందని అన్నారు. ఆర్యసమాజ్ ప్రచారకులు నాగరాజుగౌడ్, వీటూరి హన్మాండ్లు తదితరులున్నారు.